




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 26-6-2025

సంపుటి: 21 సంచిక: 80
పేజీలు: 8 వెల: రూ.1




డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో పడిగాపులు కాస్తున్న ఉద్యోగులు



# ముడుపులిస్తేనే 'మూవ్‌మెంట్'!

- బదిలీ అయినా కొత్త స్థానాల్లో చేరలేని ఉద్యోగులు
- చేయి తడిపినవారి చేతికే ఆర్డర్
- గిరిజన ప్రాంతాల బదిలీల్లోనూ అవకతవకలు
- ఖాళీ అయ్యే సీట్లను వెంటనే భర్తీ చేయాలన్నది రూల్
- కానీ అలా చేయకుండా వదిలేస్తున్న అధికారులు
- దాంతో ట్రాన్స్‌ఫర్ అయినా కదల్లేక పలువురి ఆవేదన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆ ఉద్యోగిని పేరు వై.మోహిని. వైద్య ఆరోగ్యశాఖలో నాన్ టీచింగ్ పీహెచ్‌ఎన్‌గా హిరమండలంలో పని చేస్తున్నారు. ఈమెను మెడికల్ గ్రౌండ్స్ కింద తాజా బదిలీల్లో పోలాకికి పంపించారు. మెడికల్ గ్రౌండ్స్ అంటే ట్రైబల్ ఏరియా నుంచి ప్లెయిన్ ఏరియాకు రావడానికి కొని తెచ్చుకున్న మెడికల్ సర్టిఫికెట్ కాదు. ఈమె శతశాతం క్యాన్సర్ పేషెంట్. ప్రస్తుతం కీమో థెరపీ చేయించుకుంటున్నారు. దీనికి తోడు రేడియేషన్ ట్రీట్మెంట్‌కు వైజాగ్ వెళ్లి వస్తున్నారు. ఈ శిక్ష చాల దన్నట్టు మూడు నెలల క్రితం ఈమె భర్త మరణించారు. క్యాన్సర్ పేషెంట్ అయిన తనకు సేవ చేసేందుకు, తోడుగా ఉండటానికి ఎవరూ లేకపోవడంతో పోలాకిలో ఉన్న తల్లి వద్దకు వెళ్లిపోడానికి ఆమె దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల మేరకు బదిలీకి అన్ని అర్హతలు ఉన్న ఈమెను పోలాకికి పంపించినట్లు చూపించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హిరమండలం నుంచి రిలీవ్ చేస్తూ మూవ్‌మెంట్ ఆర్డర్ మాత్రం ఇవ్వలేదు. ఎందుకంటే.. ఎవరి లెక్కలు వారివి. తన ట్రీట్‌మెంట్‌కు, భర్త అంత్యక్రియలకు కలిపి మోహిని మెడికల్ లీవ్ పెట్టగా దాన్ని శాంక్షన్ చేయడానికి డబ్బులు దండిన ఘనత మన వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులదే. ఇప్పుడు మోహినీకి బదిలీ అత్యావశ్యం కాబట్టి మెడికల్ లీవ్ శాంక్షన్‌కే డబ్బులిచ్చిన ఆమెకు ఇప్పుడు మూవ్‌మెంట్ ఆర్డర్ ఉత్తపుణ్యానికే ఎందుకివ్వాలన్న కోణంలో తిప్పుతున్నారు.

ఆయన పేరు భాస్కరరావు. వయసు 60. భామిని పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్తాఫీసర్‌గా పని చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ఎల్.ఎన్.పేటకు బదిలీ అయ్యారు. దానివల్ల భామినిలో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు కొత్త అధికారి రాకపోవడంతో భాస్కరరావును ఎల్.ఎన్.పేట పంపలేమంటూ భామినిలోనే ఉంచేశారు. ట్రైబల్ యాక్ట్ ప్రకారం ఏదైనా గిరిజన ప్రాంతంలో పనిచేసే ఉద్యోగిని బదిలీ చేయాల్సి వస్తే ఆ స్థానంలో వెంటనే వేరొకర్ని నియమించాలని, లేదంటే పాతవారినే కొనసాగించాలనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం ఒక చేత్తో బదిలీ చేసినప్పుడు మరో చేత్తో నియమించాలన్న కనీస అవగాహన వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టరేట్‌కు లేకపోవడం విడ్డూరం. దీంతో ఎల్.ఎన్.పేటకు వెళ్లలేకపోయిన భాస్కరరావు కోర్టును ఆశ్రయించారు. ఇప్పటికీ ఆ కేసు విచారణలో ఉంది. తాజా బదిలీల్లో కూడా మళ్లీ ఆయనకు ఎల్.ఎన్.పేట బదిలీ అయింది. మరోసారి అదే కథ రిపీట్ అయినట్లే.

కంచిలి మండలం మఠం సరియాపల్లిలో ఎంపీహెచ్‌ఈవోగా సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న కె.వేణుకు అదే మండలంలోని మాణిక్యపురానికి బదిలీ అయింది. ఇది కూడా స్పౌజ్ కోటాలో. ఈయనకు కూడా ఇంతవరకు మూవ్‌మెంట్ ఆర్డర్ ఇవ్వలేదు.

..ఇలా చెప్పుకుంటూపోతే జిల్లా వైద్యఆరోగ్యశాఖ పరిధిలో జరిగిన తాజా బదిలీల్లో స్థానచలనం ఖరారైనా మూవ్‌మెంట్ ఆర్డర్ అందుకోని వారెందరో ఉన్నారు. దీనికి కారణామేంటయ్యా అంటే.. టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌ను సంబంధిత అధికారులు లేదా సూపరింటెండెంట్లు సాకుగా చూపుతారు. కానీ తెరవెనుక జరుగుతున్న భాగోతం వేరు. ఒక మూవ్‌మెంట్ ఆర్డర్‌కు రూ.2వేలు నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ సొమ్ము ముడితే తప్ప ఆర్డర్ కాగితాన్ని ఉద్యోగుల చేతిలో పెట్టడం లేదని తెలిసింది. సాధారణ బదిలీల్లో భాగంగా వందలాది మందికి స్థానచలనం కలిగి కొత్త ప్లేసుల్లో జాయినైతే, వారిలో కొందరికి మాత్రం మూవ్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వకపోవడానికి కారణం సొమ్ములు ముట్టకపోవడమేనన్న ఆరోపణలు ఉన్నాయి. రూ.2 వేల కోసం ఇన్ని బాధలెందుకు? అన్న అనుమానం రావచ్చు. కానీ ఇప్పటివరకు మూవ్‌మెంట్ ఆర్డర్ అందని వారందరి నుంచి పెద్దమొత్తాన్ని ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. బదిలీ అయిన వారికి ఆ స్థానం ఎంత అవసరమో తెలిసిన డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది

- మిగతా చివరి పేజీలో




• ఎడిటోరియల్

# శ్వాసకూ ఉందట ఓ ముద్ర!

వేలిముద్రల గురించి తెలియని వారెవరూ ఉండరు. ఎందుకంటే.. ఈ రోజుల్లో దాదాపు ప్రతి ప్రభుత్వ పథకం అమల్లోనూ, వ్యక్తులను గుర్తించే విషయంలోనూ బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో ఆయా వ్యక్తుల వేలిముద్రలు లేదా ఐరిస్ అంటే కనుపాప ముద్రలు తీసుకుని ఈ కేవైసీ చేయడం పరిపాటిగా మారింది. ఇప్పుడు ఇదెందుకు ప్రస్తావిస్తున్నామంటే.. వేలిముద్రల మాదిరిగానే మనం తీసుకునే శ్వాసకు కూడా ఒక ప్రత్యేక ముద్ర ఉంటుందని శాస్త్రవేత్తలు తాజాగా నిర్ధారించడమే విశేషం. వేలిముద్రలు ఒకే మనిషికి చెందిన రెండు వేళ్లతో సరిపోలవు.. అలాగే ఏ ఇద్దరు మనుషుల వేలిముద్రలూ ఒకేలా ఉండవు. శ్వాసముద్ర కూడా అచ్చం ఇలాగే ఉంటుందట! ఒక మనిషి ఆలోచనలు, ఆరోగ్యం ఎలా ఉన్నాయన్నది ఈ శ్వాసముద్ర కచ్చితంగా చెప్పేసే పరిస్థితి ఎంతో దూరంలో లేదని శాస్త్రవేత్తలు అంటున్నారు. శ్వాస మీద ధ్యాస పెట్టడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని చాలామంది చెబుతుంటారు. అయితే ఇది కేవలం నమ్మకమా లేక శాస్త్రీయంగా నిరూపితమైందా అనే సందేహం ఉండేది. ఈ సందేహాలకే ఇప్పుడు స్పష్టమైన శాస్త్రీయ ఆధారం లభించింది. ఇజ్రాయెల్‌కు చెందిన ప్రముఖ సంస్థ వీజ్‌మన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు చెందిన న్యూరో బయాలజీ ప్రొఫెసర్ నోమ్ సోబెల్ నేతృత్వంలోని బృందం నిర్వహించిన పరిశోధన అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. శ్వాస తీరుతెన్నులకు, వ్యక్తుల భావోద్వేగాలూ ఆరోగ్య స్థితిగతేలకు మధ్య ఏమైనా సంబంధం ఉందా అన్న కోణంలో జరిపిన ఈ అధ్యయన ఫలితాలు కరెంట్ బయాలజీ అనే ప్రఖ్యాత జర్నల్‌లో ఇటీవల ప్రచురితమయ్యాయి. పరిశోధనలో భాగంగా వంద మందికి పైగా వ్యక్తుల శ్వాస తీరును 24 గంటల పాటు నిశితంగా పరిశీలించి, విశ్లేషించారు. ఈ అధ్యయనం కోసం వారి ముక్కు వద్ద ప్రత్యేకమైన సెన్సర్ పరికరాలు అమర్చారు. వారు నిద్రలో ఉన్నా, మేల్కొని ఉన్నా, మాట్లాడుతున్నా, నడుస్తున్నా.. ఇలా అన్ని సమయాల్లోనూ వారి శ్వాస తీరును నిరంతరం ట్రాక్ చేశారు. వాటిని విశ్లేషించగా అత్యంత ఆశ్చర్యకరమైన ఫలితాలు లభించాయి. ప్రతిఒక్కరి శ్వాసతీరు ఇతరుల శ్వాస ముద్రతో సరిపోలకుండా 96.8 శాతం వరకు ప్రత్యేకంగా ఉన్నట్టు తేలింది. అంటే మన వేలిముద్రలే కాదు, మన శ్వాస ముద్ర కూడా ఎంతో ప్రత్యేకమైనదని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. ఇది ఒకరిని మరొకరి నుంచి వేరు చేసే ఒక విశిష్టమైన జీవ కారకం అని రుజువు చేసింది. మరింత కీలక అంశం ఏమిటంటే వ్యక్తుల శ్వాస తీరు ద్వారా వారి మానసిక స్థితి, ఆరోగ్య పరిస్థితులను కూడా అంచనా వేయవచ్చని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఉదాహరణకు వ్యాకులతతో బాధపడేవారు తక్కువ గాలి పీల్చడం, శ్వాస తీసుకోవడంలో ఎక్కువ విరామాలు ఉండటం వంటి లక్షణాలను గుర్తించారు. నిద్రలో ఉన్నప్పుడు కూడా కొంతమంది శ్వాస తీరు మారుతుండగా, వ్యథ, ఆందోళనలో ఉన్నవారు మేల్కొని ఉన్నప్పుడు శ్వాసను బలవంతంగా తీసుకోవడం, ఉఛ్వాస నిశ్వాసాల మధ్య విరామం తీసుకోవడం వంటివి కనిపించాయి. ఈ లక్షణాల ఆధారంగా భవిష్యత్తులో మనుషుల్లోని మానసిక వ్యాధులను ముందుగానే గుర్తించవచ్చని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇది దయాగ్నస్టిక్ రంగంలో ఒక విప్లవాత్మక మార్పుకు దారితీసే అవకాశం ఉంది. ఈ పరిశోధన తెలియజేస్తున్న అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే.. మనం తీసుకునే శ్వాస తీరును మార్చుకుంటే ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యల నుంచి విముక్తి పొందవచ్చని ప్రొఫెసర్ నోమ్ సోబెల్ చెబుతున్నారు. ధ్యానం, శ్వాసాభ్యాసం (ప్రాణాయామం) వంటి యోగా పద్ధతులు ఆధ్యాత్మిక పద్ధతులు మాత్రమే కాదని.. శాస్త్రీయంగా కూడా అవి ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఈ అధ్యయనం మరోసారి నిరూపించింది. శ్వాసను నియంత్రించడం ద్వారా మన నాడీ వ్యవస్థపై, తద్వారా మానసిక స్థితిపై సానుకూల ప్రభావం చూపవచ్చని ఇది స్పష్టం చేసింది. ఇప్పటివరకు మౌఖికంగా చెప్పుకొచ్చిన 'శ్వాస మీద ధ్యాస' మహత్యం ఇప్పుడు శాస్త్ర విజ్ఞానంతో బలపడింది. ప్రతి ఒక్కరి శ్వాస ముద్ర ప్రత్యేకమని, దాన్ని అధ్యయనం చేయడం ద్వారా అనేక రుగ్మతలను ముందుగానే గుర్తించవచ్చని ఈ పరిశోధన తెలుపుతోంది. యోగా, ధ్యానం చేసే వారి ఆరోగ్య ప్రయోజనాలకు ఇది ఒక బలమైన శాస్త్రీయ మద్దతు. శ్వాస మీద ధ్యాస పెడితే ఆయురారోగ్యాలు సమకూరుతాయనే మాట ఇక ఎంతమాత్రం కేవలం నమ్మకం కాదు. అది ఒక తిరుగులేని శాస్త్రీయ సత్యమని ఇజ్రాయెల్ శాస్త్రవేత్తల అధ్యయన ఫలితాలు ప్రపంచానికి చాటిచెబుతున్నాయి.




2025-26 ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి తరువాత రైతులు విత్తనాలు నాటడంలో భాగంగా గార మండలం నిజామాబాద్ గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో శాసనసభ్యులు గొండు శంకర్ ముఖ్య అతిథిగా రైతులందరికీ రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## రోటరీ క్లబ్ శ్రీకాకుళం సేవలు భేష్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రోటరీ క్లబ్ శ్రీకాకుళం సేవలు భేష్ అని, శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. సింగుపురం కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో విద్యార్థులకు సుమారు ఆరు లక్షల విలువగల పరుపులను రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్ష బృందం గురువారం అందించారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలితకు, 225 పరుపులు అందించిన అనంతరం మాట్లాడుతూ రోటరీక్లబ్ శ్రీకాకుళం అధ్యక్షులు ముని శ్రీనివాస్ బృందం, విద్యార్థులకు అవసరమైన సామాగ్రిని అందించి ఉదారత చాటుకున్నారన్నారు. రోటరీక్లబ్ శ్రీకాకుళం సేవలు విస్తృతం కావాలన్నారు. విశిష్ట అతిథిగా సమగ్రశిక్ష అభినయాన్ డాక్టర్ శశిభూషణ్ పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. రోటరీ ఆలోచనా విధానాలు, సేవలు ఆలోజింపజేస్తాయన్నారు. విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే తపనతో ముందుకు వెళ్తున్నారన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని, ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, అది చేరేవరకు కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే, రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షులు ముని శ్రీనివాస్, సెక్రటరీ దూసి సంతోష్, కోశాధికారి సూర్య పసగాడాలను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించి శుభాభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి వెంకటస్వామి, ఇతర రోటరీ బృందం, సింగుపురం సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు, ఉప సర్పంచ్ కుంచాల ఆదినారాయణ, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఏపీ పిజిసెట్ 2025 ఫలితాలలో 'కాకినాడ' హవా



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు బుధవారం విడుదల చేసిన ఏపీ పిజిసెట్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో ఎలక్ట్రానిక్స్ విభాగంలో యామిని సంపతిరావు 5వ ర్యాంక్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో రోజాశ్రీ మరువాడ 10వ ర్యాంక్ సాధించారు, కంప్యూటర్ సైన్స్ విభాగంలో వరుసగా 38, 53, 143ర్యాంకులు, ఎలక్ట్రానిక్స్ విభాగంలో 64,91వ ర్యాంక్, స్టాటిస్టిక్స్ విభాగంలో 104వ ర్యాంకులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ తెలియజేశారు. శివశంకర్ మాట్లాడుతూ కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థినిలు ఐసెట్‌లలోనే కాకుండా పిజిసెట్, ఎడ్ సెట్ ఫలితాలలో కూడా ఉత్తమ ప్రతిభ చూపించారన్నారు. దీనికి కారణం తమ కళాశాలలో విద్యార్థి చేరిన మొదటి రోజు నుండి సెట్స్‌పై అవగాహన తెచ్చి దానికి కావలసిన శిక్షణ ఇవ్వడమేనన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు మంచి క్యాంపస్ కొలువులు కూడా సాధించారన్నారు. కళాశాలలో ర్యాంకులను సాధించిన విద్యార్థినులను అభినందించారు. కార్యకమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు. ర్యాంకులను సాధించిన విద్యార్థినిలను కళాశాల చైర్మన్ డా ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డా.సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డా బిఇవిఎల్ నాయుడు అభినందించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

## ఆడవరంలో బంకించంద్ర చటర్జీ జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గార మండలం ఆడవరం గ్రామంలో ప్రాథమిక పాంశాల ప్రధానోపాధ్యాయులు భోగెల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో వందేమాతరం గీత రచయిత బెంగాల్‌కు చెందిన బంకించంద్ర చటర్జీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బంకించంద్ర చటర్జీ గురించి, వందేమాతరం గురించి విద్యార్థులకు వివరించారు.



## పేరుకే స్వచ్ఛభారత్.. రోడ్లన్నీ బురదమయం

(సత్యంన్యూస్, కొత్తూరు)

దేశ ప్రధాని నుండి గ్రామసర్పంచ్ వరకు ప్రతి ఒక్కరు స్వచ్ఛ భారత్ అంటూ నినాదాలు ఇస్తూ ఉంటారు. కానీ స్వచ్ఛ భారత్ అంటూ చేసే కార్యక్రమాలు అదరగొడుతూ ఉంటారు. కానీ వాస్తవంలో అనుకున్న లక్ష్యాలను చేరుకున్నాయా.. అంటే లేదనే చెప్పాలి. శ్రీకాకుళం జిల్లా హెడ్ క్వార్టర్ నుండి మండల హెడ్ క్వార్టర్ల వరకు ఎక్కడ చూసినా రోడ్లన్నీ బురదమయంగా కనిపిస్తున్నాయి. స్వచ్ఛభారత్ అంటే ముందుగా ఆర్టీసీ కాంప్లెక్స్‌లే ప్రతి ఒక్కరికి కనబడతాయి. ముఖ్యంగా కొత్తూరు ఆర్టీసీ కాంప్లెక్స్ ఎప్పుడు చూసినా బురదమయంగానే కనిపిస్తుంది. నిత్యం రద్దీగా ఉండే ప్రదేశాలు ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. నాయకులు, అధికారులు ప్రసంగాల్లో అదరగొట్టడమేనా వాస్తవంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేసేది ఏమైనా ఉందా అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.







## ఇక్కడ 'కుబేర'.. తమిళంలో బిచ్చగాడే

తెలుగులో 'కుబేర'కు మంచి వసూళ్లు దక్కుతున్నాయి. శేఖర్ కమ్ముల దర్శకత్వ ప్రతిభ, ధనుష్ నటన, నాగ్ సరికొత్త ప్రయత్నానికి మార్కులు పడుతున్నాయి. కానీ అదేంటో తమిళనాట మాత్రం ఈ సినిమాని పట్టించుకోవడం లేదు. ధనుష్ కోసమైనా జనాలు థియేటర్లకు వెళ్లాలి. కానీ అది కూడా జరగడం లేదు. ఓ తమిళ నటుడు తెలుగులో ఓ సినిమా చేస్తున్నాడంటే, తమిళ మార్కెట్ ప్లస్ అవుతుంది అనుకొంటారు నిర్మాతలు. అయితే 'కుబేర' విషయంలో అది జరక్కపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. తమిళ ప్రేక్షకుల మైండ్ సెట్ పూర్తిగా వేరన్నది 'కుబేర' సినిమాతో మరోసారి అర్థమైంది. ఈ సినిమాని వాళ్లు డబ్బింగ్ సినిమాగా లెక్క గట్టారు. ధనుష్ తప్ప, తమిళ నటీనటులెవరూ ఈ సినిమాలో కనిపించలేదు. రెండు భాషల్లో ఈ సినిమా తీసినా, వాళ్లు తెలుగు నుంచి వచ్చిన డబ్బింగ్ బొమ్మగానే భావించారు. ఇక్కడి సెన్సిబులిటీస్ వాళ్లకు ఎక్కలేదు. ఇదే సినిమా, ఇదే కథతో ఓ తమిళ దర్శకుడితో ధనుష్ గనుక చేసి ఉంటే, అక్కడ దీన్ని బ్లాక్ బస్టర్ చేసేవాళ్లు. కానీ తెలుగు దర్శకుడు, తెలుగు టీమ్‌తో చేస్తే మాత్రం పట్టించుకోలేదు. తెలుగు దర్శకులు తమిళ హీరోలతో సినిమాలు చేసినప్పుడు ఇదే ఇబ్బంది ఎదురవుతోంది. అక్కడ తమ హీరో నటించినా సరే, ఆ సినిమాని పట్టించుకోవడం లేదు. ఇది వరకు ధనుష్ 'సార్' అనే సినిమా చేశాడు. దానికీ ఇలాంటి ఇబ్బందే. 'ప్రిన్స్' సినిమానీ ఆ కళ్లతోనే చూశారు తమిళ ఆడియన్స్. తెలుగు ప్రేక్షకులకు ఉన్న పెద్ద మనసు ఇంకెక్కడా ఉండదన్న విషయం మరోసారి రుజువైంది. తమిళ డబ్బింగ్ బొమ్మలు ఇక్కడ బాగా ఆడిన సందర్భాలు కోకొల్లలు. తమిళం కంటే డబ్బింగ్ వెర్షనే ఎక్కువ వసూళ్లు తెచ్చుకొన్న సందర్భాలూ చూశాం. మనకు సినిమా అంటే సినిమా. అంతే. కానీ తమిళ ప్రేక్షకులకు అలా కాదు. సినిమాతో పాటు చాలా లెక్కలు ఉంటాయి. భాష, ప్రాంతం ఇవన్నీ బేరీజు వేసుకొంటారు. అందుకే 'కుబేర'లో ధనుష్ నటించినా, అది పరాయి సినిమాలానే అనిపించింది.

**- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...**

## దృశ్యం 3.. ఇది అయ్యే పనేనా?



మలయాళ దర్శకుడు జీతూ జోసెఫ్ క్రియేట్ చేసిన సూపర్‌హిట్ సిరీస్ దృశ్యం. ఇప్పటికే వచ్చిన రెండు సినిమాలు విజయాన్ని అందుకున్నాయి. మాతృకలో మోహన్‌లాల్ నటించగా, రీమేక్‌లలో వెంకటేష్ (తెలుగు), అజయ్ దేవ్‌గన్ (హిందీ) కనిపించారు. అన్నీ వెర్షన్‌లు కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇప్పుడు దృశ్యం 3 కథ కూడా పూర్తయింది. అయితే ఈసారి అన్నీ భాషల్లో ఒకేసారి షూట్ చేసి, ఒకే డేట్‌కి రిలీజ్ చేయాలని భావిస్తున్నారు జీతూ జోసెఫ్. "మలయాళంలో నేను రాసిన కథతోనే హిందీ, తెలుగు భాషల్లో దృశ్యం 3 వస్తుంది. హీరోల డేట్స్ కారణంగా ఒకే సమయంలో చిత్రీకరించలేకపోవచ్చు. కానీ అన్ని భాషల్లో ఒకేసారి విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నాం" అన్నారు జీతూ. జీతూ ఇలాంటి ప్రకటన చేయడానికి కారణం వుంది. ఇది ఒక సస్పెన్స్ థ్రిల్లర్. ఒక్క భాషలో విడుదలైనా ఆ సస్పెన్స్ రివీల్ అయిపోతుంది. దృశ్యం 2కి ఇదే జరిగింది. దృశ్యం 2 మలయాళం వెర్షన్ ఫిబ్రవరి 2021లో వచ్చింది. తెలుగు వెర్షన్ అదే ఏడాది నవంబర్‌లో నేరుగా అమెజాన్ ప్రైమ్‌లో విడుదలయ్యింది. అయితే అప్పటికే మలయాళం వెర్షన్ చూసేయడంతో తెలుగు వెర్షన్‌కి రావాల్సిన వ్యూవర్‌షిప్ రాలేదు. అందుకే ఇప్పుడు అన్నీ భాషల్లో ఒకేసారి విడుదల చేయాలని చూస్తున్నారు. కానీ ఇది మామూలు విషయం కాదు. గౌతమ్ మీనన్ ఇలాంటి ప్రయోగం గతంలో నాగచైతన్య, శింబుతో చేసి లెంపలు వేసుకున్నాడు. ఇద్దరు హీరోలతో ఏకకాలంలో సినిమా తీయడం తలకుమించిన పని అని వాపోయాడు. దృశ్యం 3 అయితే ముగ్గురు హీరోలు చేయాలి. అందులోను ఒకే సమయంలో రిలీజ్ అంటున్నారు. మరి ఈ టాస్క్ ఎలా వర్క్ అవుట్ అవుతుందో చూడాలి. **- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...**

# మిల్కీ బ్యూటీ క్రేజీ లైనప్

ఇండస్ట్రీలోకి వచ్చిన రెండు దశాబ్దాల తర్వాత కూడా తన ఫామ్ ను కంటిన్యూ చేస్తూ హంగామా చేస్తుంది మిల్కీ బ్యూటీ తమన్నా. ఇప్పటికి కూడా వరుస పెట్టి సినిమాలు చేస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తున్న తమన్నా మొన్నీమధ్య ఓదెల2 సినిమాతో ఆడియన్స్ ముందుకొచ్చింది. తమన్నా ప్రధాన పాత్రలో నటించిన ఓదెల2 భారీ అంచనాలతో వచ్చినప్పటికీ ఆ సినిమా అంచనాలను అందుకోలేకపోయింది. ఓదెల-2 తర్వాత రైడ్-2 సినిమాలో తమన్నా స్పెషల్ సాంగ్ చేసి ఎంతో మంది మనసుల్ని గెలుచుకున్న తమన్నా చేతిలో ప్రస్తుతం పలు ప్రాజెక్టులున్నాయి. ఓదెల2 తర్వాత తమన్నా తెలుగులో మరో సినిమాకు సైన్ చేయకపోయినా బాలీవుడ్ లో మాత్రం అమ్మడు పలు సినిమాలకు సైన్ చేసింది. తమన్నా లైనప్, ఆ సినిమాల డైరెక్టర్లు చూస్తుంటే తమన్నా అప్ కమింగ్ ప్రాజెక్టులపై ఆసక్తి పెరుగుతుంది. బాలీవుడ్ లోని స్టార్ డైరెక్టర్లతో తమన్నా సినిమాలు చేస్తోంది. అందులో భాగంగానే మిల్కీ బ్యూటీ రోహిత్ శెట్టి దర్శకత్వంలో ఓ బయోపిక్ లో నటించనుంది. జాన్ అబ్రహం మరియు రోహిత్ శెట్టి కలయికలో వస్తోన్న ఓ బయోపిక్ లో తమన్నా ఫీమేల్ లీడ్ గా కనిపించనుంది. దాంతో పాటూ బాలీవుడ్ హిట్ మూవీ నో ఎంట్రీకి సీక్వెల్ గా వస్తోన్న నో ఎంట్రీ2 లో తమన్నాకు అవకాశం లభించిందని సమాచారం. అనీస్ బాజ్మి దర్శకత్వంలో వరుణ్ ధావన్, అర్జున్ కపూర్, దిల్జీత్ సింగ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటోంది. ఆల్రెడీ డైరెక్టర్ తమన్నాకు నెరేషన్ ఇవ్వగా కథ నచ్చి ఆమె సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. త్వరలోనే షూటింగ్ ను మొదలుపెట్టి, కుదిరితే ఈ ఏడాదే సినిమాను రిలీజ్ చేయాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. ఇక అజయ్ దేవగణ్, డైరెక్టర్ జగన్ శక్తితో కలిసి చేస్తున్న రేంజర్ అనే ఫారెస్ట్ అడ్వెంచర్ ఫిల్మ్ లో తమన్నా హీరోయిన్ గా నటిస్తోంది. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న రేంజర్ సినిమాలో సంజయ్ దత్ విలన్ గా నటిస్తున్నారు. గతంలో అజయ్ దేవగణ్- తమన్నా కాంబినేషన్ లో హిమ్మత్ వాలా రాగా ఆ సినిమా డిజాస్టర్ అయింది. ఆ తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు వారిద్దరి కలయికలో సినిమా వస్తోంది. ఇవి కాకుండా అరుణబ్ కుమార్, దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో సిద్ధార్థ్ మల్హోత్రాకు జోడీగా వివాన్ అనే సినిమాలో కూడా తమన్నా నటిస్తోంది. ఇవి చేస్తూనే టాలీవుడ్, కోలీవుడ్ లో మరిన్ని సినిమాలను లైన్ లో పెట్టడానికి తమన్నా కథలు వింటూ చాలా బిజీగా ఉంటోంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...





# విజయవంతమైన ఎత్తుగడ

# వ్యూహాత్మక విజయానికి తోడ్పడకపోవచ్చు!

(ఈ వ్యాసాన్ని అనువదిస్తున్న సమయంలోనే రెండు నాటకీయ పరిణామాలు జరిగాయి. ఇరాన్ తన అణు స్థావరాలపై అమెరికా చేసిన దాడులకు ప్రతీకారంగా సోమవారంనాడు ఖతార్‌లో అమెరికా ప్రాంతీయ సైనిక కేంద్రం గావున్న అల్ ఉదీద్ వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేసింది. ఆ తరువాత ఆశ్చర్యకరంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయిల్-ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని ప్రకటించారు. ట్రంప్ ప్రకటన వెలువడిన కొన్ని గంటల తర్వాత, మంగళవారం తెల్లవారుజామున ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణను ప్రకటించింది.
- అనువాదం: నెల్లూరు నరసింహారావు)

డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడిలో భాగస్వామి అవటం గురించి మాట్లాడుతూ,"నేను చేయవచ్చేమో" లేదా "నేను చేయకపోవచ్చు.. నేను ఏమి చేయబోతున్నానో ఎవరికీ తెలియదు" అని అన్నారు. మరుసటి రోజు వైట్ హౌస్ అధికార ప్రతినిధి అమెరికా అధ్యక్షుడు రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటారని ప్రకటించారు. కానీ చివరికి, దాడి చేయాలనే నిర్ణయం శనివారంనాడు కేవలం మూడు రోజుల్లోనే వచ్చింది. ఈ కాలక్రమం, ఇందుకు సంబంధించిన ప్రకటనలు బహుశా మోసపూరిత ప్రణాళికలో భాగమనిపిస్తుంది.

నిజానికి ఇరాన్‌పై యుద్ధం ఎల్లప్పుడూ ఇజ్రాయెల్- అమెరిక ఉమ్మడి కార్యక్రమంగా ఉంటుందని నమ్మడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఇరానియన్ క్షిపణుల నుంచి ఇజ్రాయెల్‌ను రక్షించడానికి అమెరికా క్షిపణి నిరోధక వ్యవస్థలను ప్రారంభం నుంచి ఉపయోగించారు. అమెరికన్ నిఘా వ్యవస్థ ఇరాన్‌పై దాడులను సమర్థవంతంగా నిర్వహించడానికి సహకరించింది. ఇప్పుడు అమెరికా విమానాలు ఇజ్రాయెల్ ప్రారంభించిన పనిని "పూర్తి" చేయడానికి ఇరాన్ అణు స్థావరాలపై బాంబు దాడి చేశాయి. సమస్య ఏమిటంటే "పనిని పూర్తి చేయడం" అనేది చాలా మంది ఊహించిన దానికంటే ఎక్కువ సమయం పట్టే ప్రక్రియ కావచ్చు. నిజానికి అమెరికన్ దాడి ఇరాన్ అణువ్యాప్తి నిరోధక ఒప్పందాన్ని విడిచిపెట్టటానికి దారితీయవచ్చు. తద్వారా ఇరాన్ తన అణు సామర్థ్యంపై అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ పర్యవేక్షణ లేకుండా చేసుకునే అవకాశం ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా అణుశక్తి సాంకేతికతను అభివృద్ధి చేయడం కోసం ఇరాన్ అత్యంత సురక్షితమైన ప్రదేశాలను నిర్మించింది. ఇందులో భాగంగా తన అణు సామర్థ్యాన్ని వికేంద్రీకరించింది. 60% వరకు శుద్ధి చేయబడిన 400 కిలోల యురేనియంను ఆ దేశం ఇప్పటివరకు కలిగివున్న రక్షిత పదార్థం. ఈ పదార్థాన్ని డజనుకు పైగా చిన్నచిన్న యురేనియం శుద్ధి చేయగల నిర్మాణాలలో ఉంచటం ఏమంత కష్టమైన పని కాదు. దీనిని ఎదుర్కోవడానికి ఇరాన్ పైన దండయాత్ర చేయాలి. అందుకోసం అమెరికన్లు సిద్ధంగా లేరు. లేదా సదరు రహస్య ప్రదేశాలపై బాంబు దాడులు అవసరమవుతాయి. అది చివరికి ఇరాన్ అణ్వస్త్రాన్ని తయారు చేయడానికి దారితీయవచ్చు. అటువంటి స్థితి ఊహాతీత పరిణామాలకు దారితీయవచ్చు.

మరోవైపు, ఇరాన్ మళ్ళీ విషపు గుళికను మింగాలని నిర్ణయించుకుని శాంతిని కోరవచ్చు. దానితో ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికన్ యుద్ధం ముగియవచ్చు. అయితే మరింత లోతైన నష్టం జరగవచ్చు. ఇరానియన్లు తమపై దాడి చేసిన దేశాలను విశ్వసించరు.ప్రతిగా, ఇజ్రాయెల్ ఎక్కువగా చెక్కుచెదరకుండా ఉన్న దేశాన్ని విశ్వసించదు. ఇజ్రాయెల్ కోరుకునే శాంతికి ఇరాన్‌ను శాశ్వతంగా నిర్వీర్యం చేయడం అవసరం. ఇరానియన్ ప్రజలు దాని కోసం సిద్ధంగా ఉన్నారా లేదా అనేది వేరే విషయం. వాస్తవానికి, అమెరికా- ఇజ్రాయెల్‌లు ఆ పరిస్థితిని ఏర్పడేలా చేయగలరా అనేది కూడా ప్రశ్నార్థకం.

తిరిగి చూసుకుంటే, టెహ్రాన్ యురేనియంను శుద్ధి చేసే హక్కును పూర్తిగా వదులుకోవాలనే గరిష్ట అమెరికన్ వైఖరిని ఇరాన్ అంగీకరించ దానికి సిద్ధంగా లేదని స్పష్టమైన క్షణం నుంచి ఇజ్రాయెల్-అమెరికన్ ప్రణాళిక రూపుదిద్దుకుంది. ఇంతకుముందు, ఇరాన్ యురేనియంను 3.67% వరకు మాత్రమే శుద్ధి చేయడానికి అంగీకరించడంతో రాజీ సాధ్యమైందని అనిపించింది. ఇది పి 5+1 అంటే ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలోని ఐదు శాశ్వత సభ్యదేశాలైన అమెరికా, చైనా, ఫ్రాన్స్, రష్యా, ఇంగ్లాండ్‌తో పాటు జర్మనీ)తో 2015లో జరిగిన జాయింట్ కాంప్రహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఒప్పందం నిర్దేశించిన పరిమితి. 2018లో ట్రంప్ జేసీపీఓఏ నుంచి వైదొలిగే వరకు ఇరాన్ దానికి కట్టుబడి ఉండేది.

ఒకవైపు అమెరికా ఇరాన్‌తో యుద్ధం చేయాలని నిర్ణయించుకుని కూడా ఇరానియన్లతో చర్చలు కొనసాగిస్తామనే కపట నాటకాన్ని కొనసాగించింది. మే నెలాఖరులో, ఇరాన్ వెలుపల యురేనియంను శుద్ధి చేసే ప్రాంతీయ కన్సార్టియంను సృష్టించే ప్రతిపాదనను వారు ఇరాన్‌కు ఇచ్చారు. ఈ ప్రతిపాదనకు టెహ్రాన్ అంగీకరించలేదు. కానీ జూన్ 13న అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవెన్ విట్‌కాఫ్‌తో అణు చర్చలలో ప్రధాన సంధానకర్త అయిన అలీ షంఖానీని ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకున్నదనే వాస్తవం అమెరికా నిజస్వరూపానికి సూచికగా ఉంది. అయినప్పటికీ, ఈ కుట్ర కొనసాగింది. ఇజ్రాయెల్ దాడుల తర్వాత కూడా స్టీవెన్ విట్‌కాఫ్ ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చితో అనేక రౌండ్ల ఫోన్ సంభాషణలు జరిపారు. ఇజ్రాయెల్ తన బాంబు దాడుల పరంపరను విరమించుకుంటే తాము తిరిగి చర్చలకు వస్తామని ఇరానియన్లు అమెరికాకు చెప్పారు. ఫ్రాన్స్, జర్మనీ, ఇంగ్లాండ్, యూరోపియన్ యూనియన్ విదేశాంగ మంత్రులు శుక్రవారం జెనీవాలో ఇరాన్ విదేశాంగ మంత్రిని కలిసి వివాదం మరింత పెరగకుండా నిరోధించారు. ఇరాన్ దౌత్యపరమైన పరిష్కారాలను పరిగణనలోకి తీసుకోవడానికి సుముఖత వ్యక్తం చేసింది. కానీ ఇరాన్ అమెరికాతో సంబంధాలు పెట్టుకోవాలని యూరోపియన్లు ఇరాన్‌కు సలహా ఇచ్చారు. అంటే ఈ విషయంలో యూరోపియన్లు చేయగలిగింది ఏమీలేదు. ప్రస్తుతం, ఇరాన్ అమెరికాపై ప్రతీకారం తీర్చుకోకపోతే అమెరికా శనివారం అణు సౌకర్యాలపై బాంబు దాడికి మించి ముందుకు సాగదని ఇరాన్‌కు తెలియజేశామని అమెరికన్లు చెబుతున్నారు. వారు అలా చేయకపోతే, అమెరికా వెనక్కి తగ్గుతుంది. మరో మాటలో చెప్పాలంటే "ప్రభుత్వాన్ని మార్చాలనే ప్రయత్నం జరగదు".

అమెరికా చర్యలు ఇరాన్‌ను నిర్వీర్యం చేయాలనే దీర్ఘకాలిక వ్యూహంలో భాగం. సాంప్రదాయకంగా, పరిణామాల భయాన్ని ప్రత్యర్థిలో కలిగించడం ద్వారా నిరోధించడం లేదా ప్రత్యర్థిని నిరుత్సాహపరచడం అనేది సైనిక వ్యూహంగా ఉంటుంది. కానీ అమెరికా కోరుతున్నది మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత మిత్రరాజ్యాలు జర్మనీకి వ్యతిరేకంగా కోరినట్టుగా, ఆ తరువాత జర్మనీలో జరిగినటువంటి మధ్యస్థ కాల పరిణామాలు ఇరాన్‌లో జరగవచ్చు.

ఇజ్రాయెల్-అమెరికన్ సైనిక ప్రాబల్య ప్రదర్శన అంతిమ పరిణామాలు మధ్యప్రాచ్యంపై వారికి పూర్తి సైనిక నియంత్రణను అందించడంగా ఉంటుంది. దీనితో ఇజ్రాయెల్ మరింత సురక్షితంగా ఉంటుందనే భావన తప్పుడు భద్రతా భావాన్ని, అహంకారాన్ని ప్రదర్శిస్తుండటంలో సందేహంలేదు. గత రెండు వారాలుగా జరిగిన సంఘటనలకు దూరంగావున్న రష్యా, చైనాలు ఈ దశలో అమెరికా ప్రాంతీయ ప్రాధాన్యతను దెబ్బతీసేందుకు ప్రతిస్పందించాల్సి ఉంటుందని భావించవచ్చు.

ప్రపంచంపై దీని పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. అన్నింటికంటే, రెండు అణ్వాయుధ దేశాలు అణ్వాయుధాలు లేని దేశంపై బాంబు దాడులు చేశాయి. అది కూడా దాడి చేయకుండానే. భద్రతకు నిజమైన హామీగా అణ్వాయుధాలను తయారు చేసుకోవడానికి మరిన్ని దేశాలు అవకాశాల కోసం చూస్తాయి. ఇజ్రాయెల్ "ఆపరేషన్ రైజింగ్ లయన్", అమెరికా "మిడ్‌నైట్ హామర్"కు ముందే ట్రంప్ విధానాలు ప్రస్తుతం అమెరికన్ అణ్వాయుధ గొడుగు కింద నివసిస్తున్న మిత్రదేశాలను భయపెట్టాయి. దశాబ్దం క్రితం ఇటువంటి ప్రశ్నలను ఎవ్వరూ ఊహించలేదు.

జరిగిన దానికి, దాని పరిణామాలకు పూర్తి బాధ్యత వహించవలసిన వ్యక్తి, డోనాల్డ్ ట్రంప్. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదనే విషయంపై ప్రపంచ సమాజం ఐక్యంగా ఉంది. అదే 2015 జేసీపీఓఏకి ఆధారం. ట్రంప్ ఆ పత్రాన్ని చింపిపడేసి, ఇరాన్‌పై "గరిష్ట ఒత్తిడి" విధానాన్ని ప్రారంభించటమే కాకుండా దాని కీలక జనరల్ ఖాసిం సోలైమానిని హత్య చేశారు. అనేక అణ్వాయుధాలను తయారు చేయడానికి తగినంత శుద్ధి చేసిన యురేనియంను సేకరించే స్థాయికి ఇరాన్ ముందుకు సాగడానికి మరో దశాబ్దం సమయం ఉంది.

జేసీపీఓఏని పునరుద్ధరించడానికి ఉద్దేశించబడిన చర్చలు విఫలం అవటానికి ట్రంప్ కూడా బాధ్యత వహించాలి. ప్రారంభంలో ఆయన "ఆయుధీకరణ వద్దు" అని స్పష్టంగా చెప్పారు. కానీ చర్చల మధ్యలో ఇజ్రాయెల్ ఒత్తిడి కారణంగా ఆయన "శుద్ధి వద్దు" అని మాట మార్చారు.

అమెరికా-ఇరాన్ అణు ఒప్పందాన్ని నిరోధించడానికి ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడి చేసిందని నమ్మడానికి కారణాలు ఉన్నాయి. శనివారం సాయంత్రం అమెరికన్ దాడులను ప్రకటించిన నెతన్యాహుకు ట్రంప్ చెప్పిన కృతజ్ఞతలు, అభినందనలు అసలు కథను చెప్పకనే చెబుతున్నాయి.

ప్రస్తుతానికి సంబంధించి, భవిష్యత్తు మనలని ఎక్కడికి నడిపిస్తుందో చెప్పలేము. దాని చరిత్ర దృష్ట్యా, ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చడంపై ఆసక్తి లేదని అమెరికా మాటను అంగీకరించడం కష్టం. ఆ దిశగా చేసే ప్రయత్నాలు ఇరాన్‌లో అంతర్యుద్ధం, అరాచకత్వానికి దారితీయవచ్చు. దాని పర్యవసానాలు పొరుగు దేశాలపై తీవ్రంగా ఉంటాయి. మరోవైపు, ఇదే పాలన మనుగడ సాగిస్తే, అది నిర్ణయాత్మకంగా బలహీనుల ఆయుధమైన ఉగ్రవాదంగా మారవచ్చు.

ప్రపంచీకరణతో వాణిజ్యం, ప్రతిభ, ఆవిష్కరణలు దేశాలను క్రమంగా సుసంపన్నం చేసే ప్రపంచ క్రమానికి దారితీస్తుందని మనం ఒకప్పుడు ఆశించిన చోట, ఇప్పుడు మనం అనిశ్చిత ప్రపంచాన్ని ఎదుర్కొంటున్నాము. ఈ ప్రపంచంలో బలవంతుల మాటే చెల్లుతుంది. వారే నియమాలను రూపొందిస్తారు.

(వ్యాస రచయిత న్యూఢిల్లీలోని అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో విశిష్ట సభ్యులుగా ఉన్నారు.)

## నూతన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఐతమ్ డైరెక్టర్

(సత్యంన్యూస్, టెక్కలి)

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపక బృందం, డాక్టర్ కె.వేణుగోపాల్ అసోసియేట్ ఆర్ అండ్ డి. డాక్టర్ జి సతీష్ కుమార్ డీన్ ఐఐసి.డి డాక్టర్ డి.శ్రీరాములు డీన్ ఆర్ అండ్‌డి. ఆధ్వర్యంలో రచించిన ది మోడర్న్ గైడ్ టు ఎంట్రీ పేన్యూర్షిప్ స్టార్టప్స్ అండ్ ఐపిఆర్ అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. ఈ పుస్తకం విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం వ్యాపారాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ పుస్తక ఆవిష్కరణకు డైరెక్టర్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్ శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఈ పుస్తక రచనకు కృషి చేసిన అధ్యాపక బృందానికి కళాశాల బోధన బోధనేతర సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.




## నట్టల నివారణ కార్యక్రమం ప్రారంభం

(సత్యంన్యూస్, నరసన్నపేట)

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ కార్యక్రమాన్ని చేపట్టిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. గురువారం పోలాకి మండలం మబగాం గ్రామంలో నట్టల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న వేళ వివిధ వ్యాధులు సంక్రమించే అవకాశాలు ఉన్నాయని వాటిని నివారించేందుకే ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు ధర్మాన అమ్మన్నాయుడు, నాయకులు కాయ రవి, మెండ రమేష్, పశువైద్యాధికారులు డాక్టర్ పద్మప్రియ, డాక్టర్ మల్లేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

మండలంలోని మండలం డి.మత్స్యలేశం ఉన్నత పాఠశాల, కొయ్యాం జూనియర్ కాలేజీలలో గురువారం డ్రగ్స్ అక్రమ రవాణా, నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సీఐ బి.ప్రసాదరావు, ఎస్సై జి.హరికృష్ణ రావు వారి సిబ్బందితో హెచ్‌ఎం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులకు ఈ అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్ బి.త్రినాద రావు, కాలేజ్ ప్రిన్సిపాల్ తవిటినాయుడు తదితరులున్నారు.

## విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆమదాలవలస పురపాలక సంఘం పరిధికి చెందిన చిన్న కృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశారు. స్థానిక కూటమి నాయకులు కూన రాము, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు బ్యాగులు,పుస్తకాలు, బెల్టు, షూ వంటివి పంపిణీ చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.ధనుంజయరావు తెలిపారు. విద్యార్థులలో అభ్యసన సామర్థ్యం, నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కృష్ణాపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చిన్న కృష్ణాపురం ఎంయుపి పాఠశాలలో విలీనం అయిందన్నారు. కృష్ణాపురం నుంచి 3,4,5 తరగతుల విద్యార్థులు చిన్న కృష్ణాపురం పాఠశాలలో చేరారని ఆ విద్యార్థుల తల్లిదండ్రులకు, సహకరించిన స్థానికులకు ధన్యవాదాలు తెలిపారు. 1నుంచి 5 తరగతులకు సుమారుగా 65మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఒక హెచ్‌ఎం తోపాటు నలుగురు టీచర్లు డి.భారతి,ఎన్. ప్రియాంక, ఎల్. రాంబాబు, ఎం.ఏసు రత్నం విద్యా బోధన చేస్తున్నట్లు తెలిపారు



## కాలభైరవ పీఠంలో ప్రారంభమైన వారాహి నవరాత్రులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం బలగ నాగావళి నది తీరాన ఉన్న శ్రీశ్రీశ్రీ బాలా త్రిపుర కాలభైరవ (పీఠం) దేవాలయంలో గురువారం వారాహిదేవి నవరాత్రులు (గుప్త నవరాత్రులు) పీఠం వ్యవస్థాపకులు గణేష్ గురూజీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనలోపల ఉండే అంతర్గత శత్రువులను, బాహ్య ప్రపంచంలో ఉన్న నరఘోష మొదలైన శత్రువుల నుండి మనల్ని కాపాడడానికి అంతగా ఉపయోగపడే అమ్మవారు వారాహిదేవి అన్నారు. అనారోగ్య సమస్యలున్న వారికి కూడా ఆరోగ్యం ఇచ్చే ఆరోగ్య ప్రదాత "వారాహి దేవి" అని, అంతటి శక్తి ఉన్న అమ్మవారు నవరాత్రులు మన పీఠంలో నిర్వహించడం చాలా అదృష్టమన్నారు. ఈ నవరాత్రులను ప్రతి ఒక్క పీఠం సేవకులు, భక్తులు సక్రమంగా వినియోగించుకోవాలని తెలియజేశారు. ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమపూజ భక్తులతో నిర్వహిస్తామన్నారు. అదే విధంగా 10 గంటలకు వారాహి దేవి హోమం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5:30లకు అమ్మవారికి బలాన్నిచ్చే యంత్రపూజ, తర్పణాలు జరుగుతాయన్నారు. తదుపరి అమ్మవారికి ద్వాదశ హారతులు ఇస్తామన్నారు. ఈ నవరాత్రుల్లో జరిగే కార్యక్రమాల్లో భక్తులందరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.


















# ముడుపులిస్తేనే 'మూవ్‌మెంట్'!

(మొదటిపేజీ తరువాయి)

సాకులు చూపుతూ మూవ్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వడంలేదు.

**ట్రైబల్ చట్టాల దుర్వినియోగం**

నిబంధనల మేరకు ట్రైబల్, ట్రైబల్ సబ్‌ప్లాన్ ఏరియాల్లో ఎక్కువ కాలం పని చేసినవారిని తప్పనిసరిగా మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలి. అదే సమయంలో ప్లెయిన్ ఏరియాలో ఉన్న వయసు పైబడని ఉద్యోగులను ట్రైబల్ ప్రాంతాలకు పంపాలి. గిరిజన ప్రాంతంలో పని చేస్తున్న 50 ఏళ్లు దాటిన ఉద్యోగులను కచ్చితంగా మైదాన ప్రాంతానికి తీసుకురావాలి. కానీ భామిని సీహెచ్‌వో భాస్కరరావుకు 60 ఏళ్లు. మరో రెండేళ్లలో రిటైరైపోతారు. ఇప్పటికే ట్రైబల్ ఏరియాలో ఎక్కువ కాలం పని చేశారు. అయినా ఆయన స్థానంలో వేరొకర్ని నియమించడానికి హెల్త్ డైరెక్టర్ కార్యాలయం ముందుకు రావడం లేదు. సారవకోటలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న ఆర్.సంతోష్‌కుమార్ విశాఖ పట్నం టీబీ కంట్రోల్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. కానీ ఆయనకు కూడా మూవ్‌మెంట్ ఆర్డర్ ఇవ్వలేదు. సారవకోట ట్రైబల్ ఏరియా అయినందున ఆయన స్థానంలో కొత్తవారిని నియమించలేదన్న నిబంధనను అడ్డు పెట్టుకుని అక్కడే ఉంచేశారు. వాస్తవానికి ఈ ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలి. ఎక్కడైనా ఓ పోస్టు ఖాళీ అయితే దాన్ని ప్రమోషన్ కోటాలో నింపాలి. ఆ మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జాబితా కూడా సిద్ధంగా ఉంది. కానీ అలా చేయకుండా ట్రైబల్ ఏరియాకు ఎవరూ వెళ్లడంలేదంటూ ఉన్నవారినే అక్కడ అదిమిపెట్టేస్తున్నారు.

**బదిలీ రిక్వెస్ట్‌కు.. మళ్లీ ఇప్పుడూ.. అమ్మ్యామ్యా!**

జిల్లాలో ఆరు పీహెచ్‌ఎన్ పోస్టులు ఉంటే వాటిలో ఇద్దరికి మాత్రమే మూవ్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చారు. మిగిలినవారికి చుక్కలు చూపిస్తున్నారు. సారవకోటలో పని చేస్తున్న అరవింద్‌కుమారికి రిమ్స్ అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌కు బదిలీ అయింది. బొంతులో పని చేస్తున్న మణిమంజరికి సింగుపురం పీహెచ్‌సీకి బదిలీ కాగా.. గుత్తావల్లిలో చిలకవేణి, మెళియాపుట్టిలో సుహాసిని కూడా బదిలీ అయింది. అలాగే ఎం.సింగుపురం లో పీహెచ్‌ఎన్‌గా పని చేస్తున్న డి.బి.నిర్మలాదేవికి రేగిడి ఆమదాలవలసకు బదిలీ అయింది. అయినా వీరెవరికీ ఇంతవరకు మూవ్‌మెంట్ ఆర్డర్ ఇవ్వ లేదు. వీటన్నింటికీ కారణం.. చేతులు తడపక పోవడమే. సాధారణంగా కోరుకున్న చోటకు బదిలీ జరిగిందన్నప్పుడే కొంత మొత్తం ముట్ట జెబుతారు. అది కాకుండా మళ్లీ మూవ్‌మెంట్ ఆర్డర్ ఇవ్వడానికి కూడా డబ్బులు తీసుకుంటు న్నారు. ఇందులో తిలా పాపం తలా పంచుకుంటు న్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రతి పనికి ఓ రేటుంటుందని అందరికీ తెలుసు. అయితే లంచం తీసుకుంటున్న కేసులో ఒక డీఎంహెచ్‌వో, ఒక సీసీ జైలుకెళ్లి ఎన్నో రోజులు కాకముందే.. అక్కడి ఉద్యోగులు ఏమాత్రం భయపడకుండా వసూళ్లలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టడం గమనార్హం. గత డీఎంహెచ్‌వో, ఆయన సీసీ డబ్బులు ఎలా తీసుకుంటూ దొరికిపోయారో ఓ కేస్ స్టడీగా తీసుకొని ఏసీబీకి దొరక్కుండా ఎలా తీసుకోవాలో ఓ పథకం తయారుచేసి మరీ వసూలు చేస్తున్నట్టు తెలిసింది. దీనిపై ప్రశ్నించా ల్సిన యూనియన్ ప్రతినిధులు కూడా బదిలీల ప్రాపకం కోసం పాకులాడటంతో ఉద్యోగులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవు తున్నారు. శ్రీకాకుళం హెడ్‌క్వార్టర్‌కు సమీప ప్రాంతంలోనే ఏఎన్‌ఎంగా పని చేస్తున్న దుర్గా బాయి అనే యూనియన్ ఆఫీస్ బేరర్ తన స్థానం పదిలం చేసుకోవడానికి మరోసారి యూనియన్ కార్డు వాడేశారు. సాధారణ ఉద్యోగికైతే ఐదేళ్లు, యూనియన్ ఆఫీస్ బేరర్‌కైతే తొమ్మిదేళ్లు బదిలీ నుంచి మినహాయింపు ఉంటుంది. కానీ ఈమె 16 ఏళ్లుగా ఈ చుట్టుపక్కలే పని చేస్తున్నారు. మళ్లీ తాజా బదిలీల్లో కూడా దూర ప్రాంతాలకు వెళ్లకుండా మేనేజ్ చేసుకోవడం వల్ల యూనియన్ నాయకులకు చెప్పి ప్రయోజనం లేదనే భావనలో ఉద్యోగులు ఉన్నారు.

# ఐఐటీ నుంచి ముని రామకృష్ణకు పీహెచ్‌డీ

**- ఆర్‌జీయూకేటీ శ్రీకాకుళం పరిపాలనాధికారికి ప్రతిష్ఠాత్మక గౌరవం -**




(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ) శ్రీకాకుళం పరిపాలనా అధికారి ముని రామకృష్ణ దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో ఒకటైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) తిరుపతి నుంచి డాక్టరేట్ పట్టా (పీహెచ్‌డీ) పొందారు. ఆర్‌జీయూకేటీ శ్రీకాకుళంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, పరిపాలనా అధికారిగా సేవలు అందిస్తున్న ముని రామకృష్ణ ఆయన ఈ పరిశోధనను ఈసీఈ విభాగంలో నెట్‌వర్క్ ఎకనామిక్స్ ఏరియాలో భాగస్వామ్య ఆధారిత సామాజిక అభ్యాస మార్కెట్లలో ధరల విధానాలు అనే అంశంపై డాక్టర్ కె.పి.నవీన్ పర్యవేక్షణలో పూర్తిచేశారు. ఈయన బీటెక్ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.టెక్ ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పూర్తి చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ సండ్ర అమరేంద్ర కుమార్, డైరెక్టర్ ప్రొఫెసర్ కెవిడిజి బాలాజీ, అకడెమిక్ డీన్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసరు వాసు, మోహన్ కృష్ణ చౌదరి, డీన్ వెల్ఫేర్ రవి, డిప్యూటీ ఏఓ డాక్టర్ గణేష్ మళ్ల, అధికారులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.





# అద్దెకు ఇవ్వబడును

చిన్నబజారు దూదివారి కోవెల ఎదురుగా మూడు ఫ్లోర్ల బిల్డింగ్ అద్దెకు ఇవ్వబడును. ఒక్కో ఫ్లోర్ 1200 చదరపు అడుగులు (20×60)

- వివరాలకు సంప్రదించగలరు -

9866 222 636


# స్వాతంత్ర్య స్ఫూర్తిజ్వాల.. వందేమాతరం

**- ఘనంగా బంకించంద్ర ఛటర్జీ జయంతి -**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వాతంత్రోద్యమంలో భారతీయులకు వందేమాతరం స్ఫూర్తిజ్వాలగా నిలిచిందని వక్తలు పేర్కొన్నారు. బ్రిటిష్ పాలకుల దురాగతాలను ఎదిరించేందుకు వందేమాతరం నినాదం అందరినీ ఏకం చేసిందన్నారు. స్థానిక స్వాతంత్ర్య సమరయోధులు స్మృతివనంలో వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటోపాధ్యాయ 187వ జయంతిని గురువారం నిర్వహించారు. బంకించంద్ర విగ్రహదాత డాక్టర్ నిక్కు అప్పన్నతో పాటు గాంధీ మందిర ప్రతినిధులు, వివిధ రంగాల ప్రతినిధులు పూలమాలలు వేసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిక్కు అప్పన్న, డాక్టర్ మందుల మోహనరావు, డాక్టర్ జామి భీమశంకర్ మాట్లాడుతూ బంకించంద్ర ఛటర్జీ రచించిన ఆనందమఠ్ నుంచి వందేమాతరం గేయాన్ని రూపొందించారని, భారత స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం శక్తివంతంగా వినియోగించారన్నారు. వందేమాతరం గేయం ప్రతి భారతీయుడు ఆలపిస్తుండడంతో బ్రిటిష్ వారు దానిపై నిషేదం విధించారని, అయినప్పటికీ భారతీయులకు నాటి నుంచి నేటి వరకు వందేమాతరం స్ఫూర్తిమంత్రంగా నిలవడం గొప్ప విశేషమన్నారు. అనంతరం బంకించంద్ర ఛటర్జీ గొప్పతనాన్ని వివరిస్తూ అవధాన పండితులు పైడి హరనాథరావు, నిష్టల నరసింహమూర్తి గేయాలు ఆలపించారు. విగ్రహ దాత నిక్కు అప్పన్నకు గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు నటుకుల మోహన్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, కొంక్యాన వేణుగోపాల్, మహిబుల్లాఖాన్, నక్క శంకర రావు, మెట్ట అనంతంభట్లు, పందిరి అప్పారావు, పెంకి చైతన్య కుమార్, తర్లాడ అప్పలనాయుడు, శాస్త్రి తదితరులున్నారు.

# బదిలీల్లో పారదర్శకత పాటించాలి




(సత్యంన్యూస్, నరసన్నపేట)

గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగుల పదోన్నతులు, జాబ్‌చార్టు అమలు, బదలీలు ప్రక్రియ సినియారిటీ ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని పోలాకి మండలపరిషత్ అభివృద్ధి అధికారిని సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈమేరకు వినతిపత్రం అందజేస్తూ ఎంపీడీవో ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. గ్రామ/ వార్డు సచివాలయ అన్ని శాఖల ఉద్యోగులకు ప్రమోషన్ ఛానెల్ కల్పించి, స్పష్టమైన జాబ్‌చార్ట్ ఇచ్చి సర్వీస్ రూల్స్ అమలుచేసిన తర్వాత మాత్రమే ట్రాన్స్‌ఫర్ పక్రియ జరపాలన్నారు. సచివాలయ ఉద్యోగులకు రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్, పెండింగ్ అరియర్ వెంటనే క్లియర్ చేయాలని, నేషనల్ ఇంక్రిమెంట్స్‌కు తక్షణమే ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. రేషనలైజేషన్ ప్రక్రియ ద్వారా మిగులు సిబ్బందిని ప్రభుత్వం ఏ విధంగా వినియోగించుకుంటుందో స్పష్టత ఇవ్వాలని, బదిలీ ప్రక్రియలో ఉద్యోగులు సొంత మండలాల్లో పని చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.



# పశువుల సంరక్షణకు నట్టల నివారణ మందులు పంపిణీ

**- రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు -**

(సత్యంన్యూస్, టెక్కలి)

రాష్ట్రవ్యాప్తంగా 2025-26 ఏడాదికి సంబంధించి తొలి విడతగా కూటమి ప్రభుత్వంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల సంరక్షణకు ప్రత్యేకంగా ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీని కోటబొమ్మాళిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు లాంచనంగా గురువారం ప్రారంభించారు. రాష్ట్రంలో జులై 10 వరకు అన్ని గ్రామాల్లో మందులు పంపిణీ జరుగుతుందని, ఏడాదిలో మూడు నెలలకు ఒకసారి నాలుగు విడతలుగా 1.76 కోట్ల గొర్రెలకు, 55 లక్షల మేకలకు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

# డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్ సభ్యత్వానికి బత్తిని లక్ష్మణ్ రాజీనామా



(సత్యంన్యూస్, మందస)

ఉద్ధానం పచ్చదనాన్ని కాపాడి రైతులకు రైతుభరోసా కేంద్రాలు ద్వారా కొబ్బరి, జీడీ, పనస, మునగ, మామిడి పంటలకు సరైన అవగాహన కల్పించి న్యాయం చేయాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్ సభ్యునిగా తనకు అప్పట్లో అవకాశం కల్పించారని, కానీ ఆ పచ్చని ఉద్దానంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి నెపంతో విధ్వంసకరమైన కార్గో ఎయిర్‌పోర్టుని నిర్మించ తలపెట్టిన నేపథ్యంలో ఆ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు బత్తిన లక్ష్మణ్ తెలిపారు. ఏడేళ్ల క్రితం వచ్చిన తిత్లీ తుఫాన్‌తో సర్వనాశనమైన సమయంలో రైతులు కష్టాలు తీర్చడానికి ప్రతిపక్ష నేతగా జగన్మోహన్ రెడ్డి 2018 డిసెంబర్‌లో తిత్లీ బాధిత రైతులతో కలిసి పాదయాత్ర చేశారని, ఆ సమయంలో అప్పటి పలాస నియోజకవర్గ ప్రతిపక్ష నేత డాక్టర్ అప్పలరాజు కళ్లకి కట్టినట్లు సమస్యలు వివరించారని గుర్తు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా వెంటనే కొబ్బరి, జీడీ మొక్కలను ఇచ్చిందని, అలాగే తిత్లీ బాధితులకు పెంచిన పరిహారం కూడా ఇప్పించిందన్నారు. అప్పటి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పచ్చని ఉద్దానం ప్రాంతం నుంచి బడుగు బలహీన వర్గాలకు చెందిన బీసీ కులంలో పుట్టిన తనలాంటి పేదవాడికి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీలో బోర్డ్ మెంబెర్‌గా రాజ్యాంగ బద్ధంగా రాజ్యాధికారంలో చోటు కల్పించారని తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం రైతుల ఆమోదం లేకుండా ఉన్నతాధికారులతో 1394 ఎకరాల స్థిరాస్తి భూములపై కొలతలు వేసి అన్యాయంగా లాక్కొనే ప్రయత్నాలు చేస్తున్నారని, కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా గత ఏడు నెలలుగా మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో భేతాలపురం, రాంపురం, చీపురుపల్లి మూడు పంచాయలోని 16 గ్రామాల ప్రజలతో కలిసి నిరంతరం ప్రజాఉద్యమాలు చేసి పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు.

ఇంకా పదవీకాలం ఉన్నప్పటికీ కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా, రైతులకు మద్దతుగా డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. రాజీనామా పత్రాన్ని పోస్టల్ ద్వారా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు పంపుతున్నట్టు వివరించారు. విలేకరుల సమావేశంలో పలాస నియోజకవర్గ వైకాపా యువజన అధ్యక్షుడు దున్న హరిక్రిష్ణ, బెలమర జీవన్, పిచ్చుక కిరణ్, మర్ల సంతోష్ పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

**- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి -**



(సత్యంన్యూస్, నరసన్నపేట)

ప్రజాసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం పోలాకి మండలం కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు వచ్చి ఎమ్మెల్యేకు వినతులను అందజేశారు.

# ఐదేళ్లలో స్టార్ బ్యూటీస్ ఎంతో ప్రగతి సాధించారు

**✔ అంతర్జాతీయ స్టార్ బ్యూటీస్ వేడుకల్లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మావతి**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




నేడు అందానికి ప్రాధాన్యత పెరిగిందని, ప్రతి కార్యక్రమానికి అందంగా ముస్తాబు కావడం ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్టార్ బ్యూటీస్ చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి స్పష్టం అన్నారు. అంతర్జాతీయ బ్యుటీషియన్ డే సందర్భంగా స్థానిక హోటల్ ప్రముఖ కాస్మోటలజిస్ట్, స్టార్‌బ్యూటీస్ అడ్మిన్ ప్రిస్కిల్లా గిరిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిధిగా పద్మావతి హాజరయ్యారు. ఈ రంగంలో స్థిరపడి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న మహిళలనుద్దేశించి మాట్లాడారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమం బ్యూటిషియన్ వృత్తి నైపుణ్యమని, అందంగా కనబడాలి, ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో స్టార్ బ్యూటీషియన్స్ ప్రతి వేడుకల్లోనూ మహిళలను అందంగా తీర్చి దిద్దుతూ వారిలో మరింత ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారన్నారు. ముందుగా స్టార్ బ్యూటీస్ అంతా పద్మావతికి శాలువతో సత్కరించి, స్టార్ బ్యూటీస్ సెలబ్రేషన్ కేక్‌ను కట్‌చేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వైజర్ రాధారాణి, శారద, కవిత, సంతోషి, సావిత్రి, వసంత, శాంతి, కృష్ణవేణి, సంధ్య, సోనియా, సౌందర్య, మంజుల, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

**ఉజ్వల భవిష్యత్తు బ్యూటీషియన్లదే**

**తెలుగు మహిళా అధ్యక్షురాలు స్వాతీ శంకర్**

ప్రతి వారిలో భగవంతుడు ఎంతో కొంత అందాన్ని ప్రసాదిస్తాడని, ఆ అందానికి మెరుగులు దిద్ది ఆకర్షణీయంగా కనిపించడంలో బ్యూటీషియన్ల పాత్ర ఎంతో కీలకమని ఉజ్వల భవిష్యత్తు బ్యూటీషియన్లదేనని నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతీ శంకర్ అన్నారు. బ్లెస్ ఏంజల్స్ పడపాన సుగుణారెడ్డి, ప్రియ, మాధురి, రమాదేవి, ఆధ్వర్యంలో అంతర్జాతీయ బ్యూటీషియన్‌డే వేడుకలు జరిగాయి. ముఖ్య అతిధిగా హాజరైన స్వాతీ శంకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యూష, కళ్యాణి, కిట్టు, సంతోషి, మాలతి, శ్రీదేవి పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.